నేడు ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ జన్మదినం

నియోజకవర్గం వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమైన కేడర్

సనత్‌నగర్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుట్టినరోజు వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుట్టినరోజు సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను పార్టీ నేతల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. నగరంలోని వివిధ నియోజకవర్గాల్లో కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా డివిజన్‌ల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ కార్యక్రమాలను పూర్తి చేసుకొని 9.30 గంటల వరకు

ఓయూలో వెంకటస్వామి జయంతి

లాలాపేట: ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓయూలో గడ్డం వెంకటస్వామి 96వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కంచ ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షులు నామా సైదులు, విజయ్ నాయక్, అరుణ్‌కుమార్, వెంకటస్వామి, కార్తీక్, హనుమంతు, పాండు తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఏసీపీ శషాంక్‌రెడ్డి



వాహనాల తనిఖీల్లో పాల్గొన్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్: వాహనదారులు మోటార్ వెహికిల్స్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని చిలకలగూడ ఏసీపీ శషాంక్‌రెడ్డి హెచ్చరించారు. విజిబిల్ పోలిసింగ్‌లో భాగంగా ఆదివారం చిలకలగూడ ఏసీపీ డివిజన్ పరిధిలోని సీతాఫల్‌మండి, వారాసిగూడ, లాలాపేట ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శషాంక్‌రెడ్డి మాట్లాడుతూ.. నగర కమిషనర్ ఆదేశాలతో విజిబిల్ పోలింగ్‌లో భాగంగా నిత్యం వాహనాల తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితర డ్యాకుమెంట్లు వాహనదారుల వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో వెహికిల్ చెకింగ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రూల్స్ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీలు, బస్తీల్లో అనుమానిత వాహనాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లలో సమాచారం అందజేయాలని ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, చిలకలగూడ, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ఎదగాలి

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

బన్సీలాల్‌పేట్: ముదిరాజ్ కులస్తులు విద్యా, ఆర్థిక, రాజకీయ, సామాజికపరంగా అభివృద్ధి చెందాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బోయిగూడ ముదిరాజ్ సంఘంలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన నవాడ ముత్తయ్య ముదిరాజ్ జయంతి, 93వ దసరా సమ్మేళనం, అలయ్ బలయ్, సామూహిక సత్యనారాయణ వ్రతాల కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ముందుకు సాగుతూ అభివృద్ధి చెందాలని సూచించారు. అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళల సంఖ్య పెరగాలన్నారు. పిల్లలను బాగా చదివించాలని కోరారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలదొక్కుకునేందుకు తాను బ్యాంకుల ద్వారా రుణాలను అందించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అందరిని ఒక్క దగ్గరికి చేర్చి ఐక్యత చాటేలా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు దొడ్ల సదానంద్, కాసాని జ్ఞానేశ్వర్ తనయుడు కాసాని సాయి, కాసాని వీరేష్, గొడుగు ఆంజనేయులు, ప్రకాష్, కార్పొరేటర్ సామల హేమ, జగదీశ్వర్, న్యాయవాది పాండు, ఎం. శ్రీనివాస్, టి. సురేందర్, శ్రీకాంత్, మన్మోహన్, రాజేంద్రప్రసాద్, వెంకటేష్, శారదా, పెద్ద ఎత్తున ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రూప్–1 ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన పలువురు ముదిరాజ్ కులస్తులను సత్కరించారు.

బంగారు గొలుసు పోగొట్టుకున్న యువతి

వెతికి అప్పగించిన పోలీసులు

రాంగోపాల్‌పేట్: ఇంటర్వ్యూ కోసం నగరానికి వచ్చిన ఓ యువతి తన బంగారు గొలుసు పోగొట్టుకోగా, పోలీసులు సీసీ కెమెరాల ద్వారా వెతికి తిరిగి అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన స్వాతి అనే యువతికి సోమవారం నగరంలో జరిగే ఓ ఇంటర్వ్యూకు వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం మినర్వా హోటల్ వద్ద క్యాబ్ దిగిన కొద్దిసేపటికి గమనించగా మెడలోని ఒకటిన్నర తులాల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో ఆమె వెంటనే మహంకాళి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమె క్యాబ్ దిగిన ప్రాంతానికి చేరుకొని సీసీ కెమెరాలు పరిశీలించగా, అక్కడ ఆమె గొలుసు కిందపడిపోయి ఉండటాన్ని గమనించారు. అదే ప్రాంతంలో గాలించగా బంగారు గొలుసు రోడ్డు పక్కన పడివుంది. బంగారు గొలుసును పోలీసులు ఆ యువతికి అప్పగించగా ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

శ్రీగిరి ఆలయంలో మహాకుంభాభిషేకం

చిలకలగూడ: శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 24 నుంచి 31 వరకు మహాసంప్రోక్షణ అష్టబంధన మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ రాజేశ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు శ్రీనివాస్, వేణుగోపాలరావు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మహాకుంభాభిషేక ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. దేవాలయ పునర్నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత శాస్త్రప్రకారం అష్టబంధన మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కంచి కామకోటి శంకరాచార్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతి, శ్రీమదష్టాక్షరీ పీఠాధీశ్వరులు త్రిదిండి అష్టాక్షరీసంపత్‌కుమార రామానుజ జీయరు స్వామి ముఖ్యఅతిథులుగా హాజరై కుంభాభిషేకంలో పాల్గొని అనుగ్రహభాషణం చేస్తారని చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలో గోదా, పద్మావతి సమేత వెంకన్న స్వామివార్లకు దూపదీపనైవేద్యాలతోపాటు అన్నిరకాల కైంకర్యాలు కొనసాగుతున్నాయన్నారు. మహాకుంభాభిషేకం తర్వాత పునర్నిర్మించిన ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, శివశంకరణ్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, షన్ముఖరెడ్డి, రాము, ఆలయ పండితులు పాల్గొన్నారు.

సీరత్- ఉన్- నబీపై క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే. శ్రీగణేశ్

బొల్లారం: సీరత్–ఉన్–నబీ (మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర)పై బొల్లారం మజీద్ కమిటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేసే కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి క్విజ్ పోటీలు విద్యార్థుల భవిష్యత్‌లో పోటీ పరీక్షలలో విజయవంతం కావడానికి దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మజీద్ కమిటీ సభ్యులు ఇక్బాల్, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, సంకి రవీందర్, బద్రి యాదవ్, శేఖర్ ముదిరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



సికింద్రాబాద్: రైలు కాంపార్ట్‌మెంట్‌లో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని మౌలాలి కార్ షెడ్ నుంచి శనివారం సాయంత్రం 6.45 గంటల సమయంలో బయలుదేరిన ఓ రైలులోని కాంపార్ట్‌మెంట్‌లో సుమారు 75 ఏళ్ల వయస్సు గల వృదురాలు మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఓయూ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభ

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ బయో మెడికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో రాణించారు. గత నెల 14న ప్రకటించిన హాక్ ఏ బోర్డ్ హ్యాకథాన్‌కు ఓయూ బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి డా. కె ఈ. విద్యాసాగర్ మార్గదర్శకత్వంలో రెండు ప్రాజెక్టులను పంపారు. ఈ నెల 4న ప్రకటించిన ఫైనల్‌లో 4వ సంవత్సరం విద్యార్థులు స్క్రీనింగ్‌లో ఉత్తీర్ణత సాధించి ఫైనల్‌లో రాణించారు. ఇందులో పక్షవాత రోగులకు సాంకేతిక వ్యవస్థ ప్రాజెక్టుకు హారిక, వెంకట జైదీప్ దత్తా మొదటి బహుమతిగా రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. రాజశ్రీ పద్మావతి, హర్షవర్ధన్‌లు రూపొందించిన పునరావాసం కోసం ధరించగలిగే హ్యాండ్ ఎక్సోస్కెలిటన్ ప్రాజెక్టుకు ఉత్తమ అవార్డు క్రింద రూ.2500 నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనతో అవార్డులు అందుకున్న రెండు జట్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు బీఎంఈ విభాగాధిపతి డాక్టర్ డి. సుమన్ తెలియజేశారు.

నియామకం



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఉద్యోగ సంఘాల ఎన్నికల్లో టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అక్బర్ బైగ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. గతంలో జరిగిన ఎన్నికలో ఈయన ఐదు పర్యాయాలు సెక్రటరీగా, ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో విజయం సాధించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఇంత కాలం తాను ప్రశ్నించే తత్వంతో ఉద్యోగుల సంక్షేమానికి పా టుడుతున్నానని అందుకే తనను వరుసగా గెలిపించారని పేర్కొన్నారు. తనకు భారీ విజయం సాధించిపెట్టిన టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.